# మూసలమ్మ మరణం

బాగా వంగి చూస్తేనేగాని లోపల ఏమున్నదీ కనిపించడంలేదు. రెండడుగుల ఎత్తయిన సన్నటి మట్టిగోడ.... పైన పాతకాలపు పలుచని రేకు.... రేకులోవున్న రంధ్రాలలో నుంచి పలుచని ఎండ లోపల నాలుగైదు చోట్ల సున్నాలు గీచినట్టు పడుతున్నది.

వెనక గోడ అవతలినుంచి సన్న సన్నగా మాటలు వినబడుతున్నాయి.

"ఎప్పుడు పోయిందట ?"

"ఏమోమరి ! రెండురోజులాయి చుట్టుపక్కల ఎక్కడా కనిపించలేదు."

"ఈ రెండురోజులూ ముసురేగా ! వర్షం తెరిపియిస్తేనా ? ఇప్పుడేగా సూర్యదర్శనం అయింది !"

"ఇప్పుడయినా ఆ వెంకటప్పయ్య తొంగిచూడబట్టి తెలిసింది."

పక్కన స్తువులన్నీ కుప్పగా వున్నాయి. ఒక పాతచాప, కొంచెం పాతసామగ్రి, ఒక పగిలిపోయిన కుంపటీ, కాసిని బొగ్గులూ, ఒక చిన్న మూట.

"ఆ మూటలో ఏముందో ?" అన్నారెవరో.

"ఆఁ ! ఏముంటుంది ?" అని చప్పరించారు మరెవరో.

కుడిపక్క సున్నం రాలిపోయిన పాత ఇటుకల గోడపక్కగా పడుకొని వుంది. పైన పాత దుప్పటి ఒకటివుంది. సన్నగా వీస్తున్న గాలికి ఆ దుప్పటి కొంచెంగా కదులుతున్నది.

అంతలో మరో ముగ్గురు నలుగురు వ్యక్తులు ఆవరణలోకి ప్రవేశించారు. అందులో ఒకరు పెద్దగా "తొమ్మిది గంటలు దాటింది. పూల

బుట్టలాగా ఎదురుగా పెట్టుకుని తిరిగ్గా కూర్చున్నారా? ఇంతకీ వెంకటప్పయ్య ఏదీ?" అన్నారు.

"మునిసిపల్ ఆఫీసుకు వెళ్లాడు....రావాలి—"అన్నారెవరో.

గోడకానుకుని తిరిగ్గా కూర్చున్న నడివయసు పెద్దమనిషి వున్నట్టుండి చప్పరించి "ఎవరన్నా కావలసిన వారున్నారేమో తెలిస్తే బాగుండును" అన్నాడు.

ఆ మాటకు ఎవరూ ఏమీ బదులు పలకలేదు.

ఒక పదేళ్ళ కుర్రవాడు ఉత్కంఠ కొద్దీ గుమ్మందాటి రాబోతే అదిలించారెవరో.

"ఎందుకురా అటు? పో లోపలికి....ఇక్కడేం కోతులాడుతున్నాయా?"

నాకు ఆ మూటలో ఏముందో చూడాలనిపించింది. అలా చాలా సేపటినుంచీ అనుకుంటూనే వున్నాను. కాని అందరిముందూ దాన్ని తాకడానికి సందేహించి ఊరుకున్నాను. ఇప్పుడిహ ఆ కోరిక ఆపుకోలేక ఒక్క ఉదుటున లేచివెళ్ళి ఆ మూట అందుకుని విప్పాను.

ముసలమ్మ చాలా జాగ్రత్తగా గట్టిగా ముడులువేసి కట్టింది. లోపల ఏవో కాయితా లున్నట్టు తెలుస్తున్నది. నెమ్మదిగా మూట విప్పాను.

అది కొంచెం వుండగా చుట్టివుంది. రెండు మూడు చిన్న చిన్న మాసిన పుస్తకాలున్నాయి పూజకు పనికివచ్చేవి. చిన్న ప్లాస్టిక్ భరిణ. రెండు పాతకాలపు ఫొటోలు కూడా వున్నాయి. భరిణ అవతల వుంచి ఫొటోలు అందుకుని ఇవతలికి జరిగి కూర్చుని వాటివంక జాగ్రత్తగా చూశాను....ఒకటి పెళ్ళి ఫొటో, క్రింద ఏదో ఫొటో స్టూడియో ముద్ర వుంది కాని అది చెరిగిపోయి అసలు కనిపించడంలేదు. ఫొటో అంతా మాసిపోయి, వెలసిపోయి రంగు మారిపోయివుంది. పురుగులేవో కొట్టివేయగా ఫొటో నిండా సన్న సన్నని రంధ్రాలున్నాయి. పెళ్ళికొడుకు కొయ్య కుర్చీలో కూర్చుని వున్నాడు. పైన చొక్కాలేదు, పంచె కట్టుకుని వున్నాడు. సన్నగా బక్కపలుచగా వుండి కళ్ళు పెద్దవిచేసి చూస్తూన్నాడు. ముక్కు కొనదేలి సన్నగా వుంది. తల నున్నగా దువ్వుకుని

వున్నాడు. చేతులు రెండూ ఏం చేయడానికీ, ఎక్కడ పెట్టడానికి తోచని వాడిలా వ్రేలాడ వేశాడు. పెదవులు విడివడి వున్నాయి. నవ్వబోతు న్నట్లున్నాడు.

ఇహ పెళ్ళికూతురు.... పొట్టిగా బొమ్మలా గున్నది. పెద్ద పట్టు చీర చుట్టుకుని వున్నది. మెళ్ళో ఏవైనా నగలున్నాయేమో తెలియడం లేదు. బెరుకు బెరుగ్గా పెద్దపెద్ద కళ్ళతో చూస్తున్నది. కుర్చీ పక్కనే అంటీ అంటనట్టుగా నిలబడి ఒక చేతిని అతి జాగ్రత్తగా కుర్చీకి దగ్గరగా వుంచింది. ఫొటోలో ఆ యిద్దరిమధ్య పెద్ద రంధ్రం వుంది.

రెండో ఫొటో పెద్దది.... కాలేజీ గ్రూప్ ఫొటో.... అదికూడా బాగా మాసిపోయి, వెలిసిపోయి వున్నది. పైన 'హిందూ కాలేజీ, గుంటూరు.... ఇంటర్మీడియేట్ .... 1930–32' అని ముద్రించి వున్నది.

దాదాపు నలభై పైగా విద్యార్థులు బల్లలమీద నాలుగు వరుసల్లో నిలబడి వున్నారు. అందరూ యిరవై సంవత్సరాల లోపువారే. కొందరు విడిగానూ, మరికొందరు పక్కవారి భుజాలమీద చేతులువేసి నిలబడి వున్నారు. కొందరు సూట్లు వేసుకుని హుందాగా నిలబడివుంటే, మరి కొందరు పంచెలు కట్టుకుని చొక్కాలు వేసుకుని వున్నారు. క్రింది వరుసలో కుర్చీల్లో అధ్యాపకులు కూర్చుని వున్నారు. మొత్తం తొమ్మిది మంది. కొందరు సూటూ బూటూ వేసుకుని కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నారు. ఇద్దరు ముగ్గురు, బహుశా తెలుగు సంస్కృతం వారు కాబోలు, పంచెలు కట్టుకుని వున్నారు. ఎవరి మొహమూ స్పష్టంగా కని పించడంలేదు. అన్నీ అసలే చిన్నచిన్న ముఖాలు.... పైగా పురుగులు చేసిన రంధ్రాలు.... అంతా అలికినట్టుంది.

పైనుంచి మూడో వరుసలో ఒక మొహం చుట్టూ పెన్సిలుతో గుండ్రంగా గీతగీయబడి వుంది. అందులో విద్యార్థి పక్కనున్నవాడి భుజంమీద చేయివేసి నిలబడి వున్నాడు. పెళ్ళి ఫొటోలో పెళ్ళికొడుకూ ఈ విద్యార్థీ ఒకరేనా అని ఆలోచించాను. రెంటినీ ఒకసారి జాగ్రత్తగా చూస్తే ఒకరే అనిపించింది.

కాగితాలకట్ట విప్పి చూశాను. అందులో ఒకపాత సర్టిఫికెట్ కని పించింది. కాలేజీలో వక్తృత్వ పోటీలో ప్రథముడుగా వచ్చినందుకు 'మా

గోవిందరావు'కు అది యివ్వబడింది, అది బాగా ముడతలుపడి శిథిలమై చిరిగిపోయే స్థితిలో వుంది.

భరిణ మూతతీసి చూశాను. ఒక పలుచని వెండి పతకం.... నా కళ్ళు మెరిశాయి.... నేను దాన్ని యివతలికి తీయగానే 'ఏమిటిది?' అంటూ నలుగురైదుగురు నా దగ్గరికి వచ్చారు.

"మెడల్.... వెండిది...." అన్నాను నేను వారికి దాన్ని అందిస్తూ.

అందరూ ఒకరి తర్వాత ఒకరుగా దాన్ని అందుకుని చూశారు.

"అవును.... వెండిదే...." అన్నారు.

నేను మిగిలిన కాగితాలు వరుసగా ఒక్కొక్కటే తీసి చూస్తున్నాను. కొన్ని ఏవో పాత దస్తావేజులు.... పాటలేవో వ్రాసివున్న ఒక నోటు పుస్తకం.... దాన్లో వెనక కాయితాలలో కొన్ని చాకలి పద్దులూ.... ఖర్చుల వివరాలూ వున్నాయి.

చిన్న ఉత్తరాల మడత .... లోపల పదిపదిహేను కవర్లు, రెండు మూడు కార్డులూ ఉన్నాయి.... ఒక కవరు ఇవతలికి తీసి లోపలి కాయితం చదివాను. తర్వాత అన్నీ చూశాను. అన్ని ఉత్తరాలు ఉమ్మడి మద్రాసులోని ఎక్కడో జైలు నుంచి వ్రాయబడ్డాయి. అన్నీ 'ప్రియమైన వసంతను' ఉద్దేశించినవే. ప్రతి దాన్లోనూ ఆమెనలా ఒంటరిగా వదలి జైలుకు వెళ్ళినందుకు చింతిస్తున్నట్టూ, అయినా ఆమె దిగులు పడనక్కరలేదనీ, ఈ పోరాటం ఎంతో కాలం పట్టదనీ. త్వరలోనే స్వాతంత్ర్య భానోదయమై తాము బయటికి వచ్చి రామరాజ్యాన్ని స్థాపించడం ఖాయమనీ. కాకపోతే అది ఎంత వ్యవధి తీసుకుంటుందో మాత్రం చెప్పలేమనీ వ్రాసివుంది. కొన్ని ఉత్తరాలలో జైల్లోఉన్న పరిస్థితులను, తిండీ తిప్పలూ వగైరాల గురించి వివరించడం జరిగింది. తాను తోటి ఖైదీలతో హాయిగా ఉన్నాననీ, తన దిగులంతా ఒంటరిగా ఉండవలసి వచ్చిన ప్రియాతి ప్రియమైన భార్య గురించేననీ కూడా వ్రాశాడు. దాదాపు ప్రతి ఉత్తరంలోనూ గుండె దిటవు అలవరుచుకోమనీ, ఈ మాత్రపు త్యాగాలు చేయలేకపోతే మానవజన్మ వృధా అనికూడా వ్రాశాడు. ఉత్తరాల్లో దస్తూరీ సరళంగా గుండ్రంగా, నీటుగా ఉంది. కొన్ని ఉత్తరాలు వందల వేలసార్లు

చదివి మడత పెట్టడంవల్ల కాబోలు బాగా నలిగి పిండిపిండి అయ్యేస్థితిలో వున్నాయి.

'వెంకటప్పయ్య వచ్చాడు' అన్నారెవరో. తలెత్తి చూశాను. నుదురు పై పంచెతో తుడుచుకుంటూ వెంకటప్పయ్య లోపలికి వస్తున్నాడు. అక్కడ ఉన్న నలుగురూ అతడు లోపలికి రాగానే అతన్ని చుట్టూ ముట్టారు.

"ఏం చేసుకొచ్చావు?"

"మునిసిపాలిటీవాళ్ళు ఏమన్నారు?"

వెంకటప్పయ్య నెమ్మదిగా "మనుషులను పంపిస్తామన్నారు. కాయితం రాసి యిచ్చి వచ్చాను. కాని వాళ్ళిప్పుడప్పుడే వస్తారని నమ్మకంలేదు. తలా రెండు రూపాయలూ యిస్తానని కూడా చెప్పి వచ్చాను. అందాకా ఏం చేసేట్టు?" అన్నాడు.

నేను తలతిప్పి చూశాను. అప్పటికే చాలా వికృతంగా ఉంది. తెరచిన నోటిమీద, మొహంమీదా అసంఖ్యాకంగా ఈగలు వాలుతున్నాయి. ఏవో సన్నని పురుగులూ యితర కీటకాలూ పాకుతున్నాయి. అటు చూసేందుకే బాధగానూ, భయంగానూ ఉంది.

"ఏం చేద్దాం మరి?" అన్నారెవరో.

"చూద్దాం .... కాసేపు చూద్దాం" అన్నాడు వెంకటప్పయ్య.

కొందరు తప్పుకున్నారు. వెంకటప్పయ్య అలాగే కూర్చున్నాడు. నేనూ అలాగే కూర్చున్నాను.

ఈ ముసలమ్మ ........ నడుం వొంగిపోయి, కళ్ళు గాజుబిళ్ళలై, శరీరం ముడతలు పడి ఎండిన కొమ్మలాంటి ముసలమ్మ ఎలాటి జీవితం గడిపింది? ఎలాటి కలలు కన్నది? ఏం తిని బతికింది యిన్నాళ్ళూ!

* * *

ఏనాడూ ఎవరినీ దేనికోసమూ ప్రాధేయ పడలేదు. ఎవరినీ యాచించలేదు. ఒంట్లో ఓపిక ఉన్నంతకాలమూ వారి యిళ్ళలో, వీరి యిళ్ళలో చాకిరి చేసింది. చుట్టుపక్కల ఎవరి ఇంట్లో ఎటువంటి హడావిడి వచ్చినా పిలవాపెట్టకుండా వంటకూ పై పనులకూ తయారయ్యేది. ఊరగాయల సీజన్ వస్తే యింటింటికీ వెళ్ళి సమస్తపనీ చేసేది. కారాలు

కొట్టేది, పిండ్లు రుబ్బేది. వంట్లో సత్తువ తగ్గడం ప్రారంభమయ్యే సరికి ఆమెకు కష్టకాలం సంప్రాప్తమైంది. చేతికి కర్రవచ్చేసరికి జుట్టు తెల్లబడింది. చూపు మందగించింది. ఎలాగో కష్టపడి డబ్బులు పోగుచేసి రోడ్డు పక్కన 'కళ్ళజోళ్లూ, గొడుగులు' బాగుచేసే వాడి దగ్గర ఒక పాత కళ్ళజోడు కొనుక్కున్నది. దాన్ని సంవత్సరాల తరబడి వాడింది. అందువల్ల చూపు మరీ అధ్వాన్నమై పోయింది. ఎవరి ఇంట్లోనైనా హడావిడి ప్రారంభమైతే చాలు వాడి యింటికి కర్ర కొట్టుకుంటూ వెళ్ళి కూర్చునేది. 'నాలుగు మెతుకులు తినిపో' అని వారిచేత అనిపించుకుని అప్పుడు తిండికి లేచేది.

నిరంతరం అర్ధాకలి తిండివల్ల, ఉపవాసాలవల్ల అకాల వార్ధక్యం ఆమెను శిధిలం చేసింది.

తర్వాత ఇతరుల యిళ్ళకు వెళ్ళడం దాదాపు మానివేసింది. ఒకనాడు గుడికి వెళ్ళేసరికి ఆమెకు కొత్త పథకం స్ఫురించింది. వెంటనే దాన్ని ఆచరణలో పెట్టింది. గుడి దగ్గర గొప్పగా వ్యాపారాలు సాగుతుంటాయి, కొబ్బరికాయ లమ్ముకునేవారూ, పూల నమ్ముకునేవారూ యిలా ఎందరో జీవిస్తుంటారు. అడుక్కుతినేవారికి కొదవలేదు. అంగవిహీనులూ, బైరాగులూ, సోమరులూ లెక్కలేనంతమంది దేవాలయం చుట్టూ తిరుగుతూ బ్రతుకుతుంటారు.

ఆమె దేవాలయం వరండాలో మకాం పెట్టింది. పొద్దునే చీకటి ఉండగానే అక్కడికి చేరుకుని భక్తులు లోపలికి వచ్చే గుమ్మం పక్కనే తిష్ఠవేస్తుంది. లోపలికి వచ్చేవారిని ఉద్దేశించి గొంతు పెద్దదిచేసి కేక పెడుతుంది.

"బాబూ! జోళ్ళిక్కడ విప్పిపొండి. అయ్యా! జోళ్ళిక్కడ విప్పిపొండి.... నేను చూస్తుంటాను...."

భక్తులు యివతలికివచ్చి తమ చిత్తం చెప్పులమీదవుండే బెడద తప్పించినందుకు తమకు తోచినంత, ఐదు పైసలో పది పైసలో పడేస్తారు. అలా రోజల్లా గడిపితే నాలుగు డబ్బులు సమకూడతాయి వాటితో నూకలుకొని రోజు వెళ్ళబుచ్చేది.

అయితే దేవాలయాలలో అన్నిరోజులూ రద్దీగా వుండవు. లేనినాడు లేనట్టే కాలం గడిపేది. ఆదివారంనాడు ఆమెకు పుష్కలంగా రాబడి

వుండేది. జనం పలుచగా తక్కువ సంఖ్యలో వచ్చిననాడు దిగులుతో ఎవరినో ఒకడిని పట్టుకుని కబుర్లలోకి దిగేది.

"బొత్తిగా కలికాలమై పోయింది. భక్తీ దేవుడూ ఏవీ లేవు యిప్పటి వాళ్ళకు. 'రామా కృష్ణా' అనుకోడమూ, గుడికివెళ్ళి దేవుణ్ణి కొలవడమూ తగ్గిపోయి నాస్తికత్వం ప్రబలి పోతున్నది. ఇది మంచికి కాదు" అని దిగులు వెళ్ళబోసుకుంటూ వుండేది. నాలుగు డబ్బులు ఎక్కువ వచ్చిన రోజున నవ్వుముఖంతో కళకళలాడుతూ వుండేది. ఏమీ లేనిరోజున కూడా నవ్వుతూనే పస్తుపడుకునేది.

ఇలా జీవితం వెళ్ళమారిపోతూ వుండగా, ఇటీవల ఆమెపై దేవుడే పగ బట్టాడా అన్నట్టుగా గొప్ప ఆపద సంభవించింది. ఒకనాడు మామూలుగా గుడికి వెళ్ళేసరికి తాను రోజూ కూర్చునే స్థలంలో మరెవరో వయసులో ఉన్న చెయ్యిలేని పిల్ల కూర్చుని ఉండటం చూసేసరికి ఆమె గుండెల్లో రాయి పడ్డట్టయింది. నిలువునా వొణికిపోయింది. కోపంతో మొహం జేవురించగా కర్రనేలమీద తాటిస్తూ "ఎవత్తెవే నువ్వు? ఎవర్ని అడిగి కూర్చున్నావిక్కడ? నీ కెన్ని గుండెలు? లే? ముందు...." అని అరిచింది.

ఆ పిల్ల లౌక్యురాలు. నెమ్మదిగా "చెయ్యిలేని దాన్నమ్మా! అడుక్కోడం యిష్టం లేదు.... ఎవరూ లేని అనాధను.... నువ్వు ఆ పక్కన వెళ్ళి కూర్చో.... నేనేం కాదనను...." అన్నది.

ముసలమ్మ అంతెత్తున ఎగిరింది. అరిచింది. "అది నా చోటు. లే అక్కడి నుంచీ...." అని అల్లరిచేసింది.

ఆ పిల్ల కదలకుండా కూర్చొని శాంతంగా "నువ్వేం కాంట్రాక్టు పాడుకున్నావా? నువ్వెంతో నేనూ అంతే"అని బదులు చెప్పింది. చివరకు భక్తులూ, చుట్టూచేరి వినోదం చూస్తున్నవారూ ముసలమ్మనే చివాట్లు పెట్టారు: "నిజమే! నువ్వేం కాంట్రాక్టు పాడుకున్నావా? ఆ అమ్మాయికీ భక్తుల చెప్పులు కనిపెట్టివుండే హక్కువుంది. ఆ మాటకొస్తే మీ యిద్దరే ఏమిటి, మరో పదిమంది ఆ పని చేయవచ్చు .... ఆ అంతే...." అన్నారు.

ముసలమ్మకు ఆనాటి నుంచి కష్టకాలం దాపురించింది. రోజూ తానెంత ముందుగా వెళ్ళినా ఆ పిల్ల తన కంటె ముందుగా అక్కడ తయారవుతూ వచ్చింది. భక్తులుకూడా ముసలిదని తనను గమనించకుండా పాపం అవిటిపిల్ల అనే సానుభూతితో ఆమె దగ్గరే ఎక్కువగా బిళ్ళ వదలి వెళ్ళడంకూడా జరిగేది. పైగా ఆ పిల్ల గొంతు మహా పెద్దది కూడా....

మొన్న సంధ్యవేళ ఉన్నట్టుండి ఆకాశంలో భయంకరమైన అలజడి ప్రారంభమైంది. నల్లని పెద్దపెద్ద మబ్బులు కొండల్లా ఢీకొని మెరుపుల కత్తులు ఝుళిపించాయి. ఏ హెచ్చరికా, సూచనా లేకుండా జరిపిన మెరుపుదాడిలాగా కుంభవృష్టి ప్రారంభమై ఉండి ఉండి కాస్సేపు ఆగినా మళ్ళీ మళ్ళీ కురుస్తూ చికాకు కలిగించింది. అదుగో ఆనాడు సాయంకాలం మాయింటికి వచ్చింది ముసలమ్మ. కర్ర కిందపడేసి 'ఉస్సు' రంటూ వరండాలో కూలబడింది. చినుకులకు జడిసి లోపలికి తలదాచు కునేందుకు వచ్చిందేమోనని అనుకున్నాను. మామూలుగా పలకరించాను. ఆ మాటా యీ మాటా అయ్యాక అదోరకకగా చూస్తూ "భోజనం అయిందా?" అని అడిగింది, "ఇంట్లో ఎవరూ లేరుగా! హోటల్లో తినే వచ్చాను" అని మామూలుగానే "నీ తిండి అయిందా?" అని అడిగాను నేను. తల అడ్డంగా ఊపింది. "మధ్యాహ్నం కూడా లేదు...." అన్నది.

నాకు జాలి వేసింది. "ఇప్పుడెక్కడికి పోగలవూ అన్నట్టు లోపలి గదిలో మా ఆవిడ ఊరికి వెళ్ళే ముందు చేసిన లడ్డూలున్నాయి. రెండు తెచ్చి యిస్తానాగు!" అని లేవబోయాను.

ఆమె ఉన్నట్టుండి లేచి కర్ర అందుకుని "నువ్వెందుకు లేవడం? నేను తీసుకుంటాలే. ఈ భాగ్యానికి...." అంటూ లోపలికి వెళ్ళింది. నేనలాగే కూర్చుండిపోయి లోపల అల్మారా అర డబ్బా వగైరా వివరాలు అందించాను. లోపల డబ్బా తీసిన చప్పుడు.... ఒక రెండు సెకండ్ల తర్వాత మూత మళ్ళీ బిగించిన చప్పుడు....

తర్వాత కర్ర చప్పుడు చేసుకుంటూ ముసలమ్మ యివతలికి వచ్చి వొడి సవరించుకుంటూ వరండా మెట్లుదిగి 'వస్తా నాయనా!' అంటూ ఆ సన్నటి చినుకులలోనే నడిచిపోయింది.

మా ఆవిడ నిన్న సాయంకాలమే దిగింది. రాత్రి నాతో "అన్నట్లు, రెండు రోజులైనా కాలేదు, డబ్బానిండా చేసిపెట్టిన యాభై కి పాతిక లడ్లే ఉన్నాయేమిటి? అన్నీ స్నేహితులను పిలిచి పంజారం చేశారా!" అన్నది. నేను ఆ డబ్బా మూత అయినా తీయలేదు. అసలటు చూడలేదు. ఆమె మాటలకు ఆశ్చర్యపోయి ఊరుకున్నాను అంతే.

"ఆ!ఆ! లేవండి....వాళ్ళొచ్చారు...." అంటూ అరుస్తూ లేచాడు వెంకటప్పయ్య. కాకీ దుస్తులు ధరించిన వాళ్ళిద్దరు లోపలికి వచ్చారు. బయట బండి నిలబడి వున్నది. ఆ తర్వాత జరగవలసిన తతంగమంతా క్షణాలమీద జరిగిపోయింది. వాళ్లు అలవాటయిన వాళ్ళలాగా ఆ ముసలమ్మను యివతలికి లాగి యీతాకు చాపలో చుట్టి బండ్లో పారేసి అంత పనీ క్షణాలమీద చేసేసి మామూలు డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు. కొద్ది నిమిషాల్లో ఆ ఫొటోలతో. కాయితాలతో, చైతన్యం లేని నేను మిగిలాను.

'బావురుమంటూ ఆవరణ మిగిలింది.'